క్లుప్తంగా

వివాహానికి హాజరైన ఎంపీ



పెళ్లి వేడుకలో ఎంపీ సురేష్ షెట్కార్ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని గుంజోటి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాంబశివరావు కుమారుడి వివాహానికి ఆదివారం జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, డీసీసీబీ మాజీ చైర్మన్ మహమ్మద్ నస్వీర్ హాజరయ్యారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వాదించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ చంద్రప్పా, న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ సిద్ది లింగయ్యస్వామి, మాజీ వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, రశీద్, సంగాయ్యసేట్, మల్లికార్జున్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న పాండురంగారెడ్డి దంపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ప్రముఖ న్యాయవాది, బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి ప్లేట్లను పంపిణీ చేశారు. తండ్రి దివంగత హన్మంత్‌రెడ్డి స్మారకార్థం పాండురంగారెడ్డి-నందినీరెడ్డి దంపతులు 200 మంది విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. బాగా చదువుకొని ఉన్నతా శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సచ్చిదానందరెడ్డి, ఉపాధ్యాయులు సునీత, మొగులయ్య, పార్వతి, విజయలక్ష్మి, రేణుక, భవాని, జ్యోతి, కృష్ణకుమార్‌తో పాటు అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఊరేగింపు



ధ్వజస్తంభం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూరలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఏర్పాటు చేసే ధ్వజస్తంభాన్ని ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి భజన సంకీర్తనలు చేశారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టి పూజలు నిర్వహించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మునిపల్లి(అందోల్): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరాలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా సహకారంతో గ్రామాల్లో సీసీరోడ్లు చేశామన్నారు. అలాగే, ఆయా గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరు చేశారని తెలిపారు. బోడపల్లి నుంచి మన్‌సాన్‌పల్లి వరకు, ఖమ్మంపల్లి నుంచి పెద్దచల్మెడ వరకు, గార్లపల్లి నుంచి పిల్లోడి వరకు బీటీ రోడ్లు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే కల్వర్టులు ఎక్కడ అవసరమో అక్కడక్కడ వేస్తామన్నారు. ప్రయాణీకులకు దూరభారాన్ని తగ్గించడానికి మంత్రి రాజనర్సింహ్మా ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంగారెడ్డి: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ పాటిల్ వివరాల ప్రకారం.. చౌటకూరు గ్రామ శివారులోని ఎన్‌హెచ్ 161పై చౌటుకూరు బ్రిడ్జి వద్ద ఈ నెల 23న రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని (30) గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వుతున్న నలుగురుపై కేసు నమోదు చేసి, టిప్పర్, జేసీబీని సీజ్ చేసిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రపురం పరిధిలోని వెలిమేల గ్రామ శివారులోని సర్వే నంబర్ 434 గల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నారని తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు టిప్పర్, జేసీబీలను సీజ్ చేసి, జగన్, నాగేశ్, రాంసింగ్, రామ్‌నాయక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం..

- వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా
- ఆకస్మికంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ
- విద్యార్థులకు అందుతున్న వైద్యంపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

సంగారెడ్డి: ఎవరూ ఆందోళన చెందొద్దని అందరికీ మెరుగైన వైద్యం అందుతుందని.. విద్యార్థులు అందరు కోలుకున్నారని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి.. చికిత్స పొందుతున్న న్యాల్‌కల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆత్మస్థైర్యం నింపారు. ఆస్పత్రిలోని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో విద్య వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నామన్నారు. రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మెరుగైన వైద్యం అందించాలి

సంగారెడ్డి: న్యాల్‌కల్ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. ఆదివారం ఆయన ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందొద్దని ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్



బీజేపీ సభ్యత్వ నమోదు రశీదు ఇస్తున్న రవీందర్

జహీరాబాద్ టౌన్: హిందూవులపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అదేల్లి రవీందర్ డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యత్వ నమోదుపై ఆదివారం పట్టణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. హిందూ దేవతలపై తరుచూ దాడులు జరుగుతున్నాయని, ఇందుకు నిరసనగా జహీరాబాద్‌లో హిందూవులు నిరసన ర్యాలీ చేశారు. ఈ క్రమంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసులు అమాయకులపై కేసులు పెట్టి వారి కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, లేని యెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తుందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారి, శివాజీ పాటిల్, గొల్లభాస్కర్, విశ్వనాథ్ స్వామి, ఓంకార్, దుర్గయ్య, శ్రీకాంత్, పూల సంతోష్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న నరోత్తం

జహీరాబాద్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం తగదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైళ్ల రాకపోకల వల్ల తరచూ గేటు మూసి ఉంచడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున 2019లో రూ.90 కోట్ల అంచనాలతో రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారన్నారు. ఐదు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోవడం ఏంటని విమర్శించారు. సర్వీసు రోడ్డు అయితే మరీ అధ్వానంగా మారిందని అన్నారు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయించాలని కోరారు.

పేదలకు అండగా ఉంటాం

రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వరప్రసాద్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు మద్దతుగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం కొత్త బస్టాండ్ ప్రాంగణంలో ఒకరోజు నిరాహార దీక్షను చేపట్టారు. దీక్షా శిబిరాన్ని రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. హైడ్రా అధికారులు గతవారం రోజులుగా ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో మార్కింగ్ చేయడంపై స్థానిక ప్రజలు భయాందోళనకు గురై నిరాహార దీక్ష చేపట్టారు. వారికి మద్దతుగా మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల జీవితాలతో రాజకీయాలు చేయొద్దని హెచ్చరించారు. 30 సంవత్సరాలుగా నివసిస్తున్న పేద ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారని తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడించి ధైర్యం కల్పించారు. పేదల ఇళ్లను కూల్చకుండా మంత్రులతో చర్చిస్తానని కాటా శ్రీనివాస్‌గౌడ్ భరోసా కల్పించారు. దీంతో నాయకులకు నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాలమ్మ నాయకులు అబ్దుల్ బషీర్, దీనానాథ్, మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

జీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శశికాంత్

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శశికాంత్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీలు రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. చాలా ప్రాంతాల్లో గంప గుత్తగా నాయకులు, ప్రజాప్రతినిధులు చెప్పిన పేర్లతోనే కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో మంది ఇంటి స్థలాలు, ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బీడీఎల్ సీఐ స్వామిగౌడ్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలంలోని కర్దనూర్ సమీపంలో డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. వాహనాల ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మారెడ్డి, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి



ఫిర్యాదు లేఖను విలేకరులకు చూపిస్తున్న బాల్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ నాయకులు కావాలనే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీలో ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి హైడ్రా అధికారులు మార్కింగ్ చేయడంపై తప్పుడు ఆరోపణలకు తెరతీశారు. కుంటల్లో నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చివేయాలని హైడ్రాకు తన పేరుతో లేఖ ఇవ్వడంపై మండిపడ్డారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపించారు. కావాలని దురుద్దేశంతో తనపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు లేఖను మీడియా ఎదుట ప్రదర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్, ప్రభు నాయక్, మాజీ ఎంపీటీసీ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: మొదటి విడతలోనే నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరయింది. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఖేడ్ నియోజకవర్గ ప్రజల తరఫున శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్, జడ్చర్ల ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరే రాధ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం పట్టణంలో నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామునే భక్తులు భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పోలీసులు

సంగారెడ్డి జోన్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 31 వరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులకు 'సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగు పర్చడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా ఉత్తమంగా నిలిచిన మూడు వ్యాసాలు రాష్ట్రస్థాయిలో ఎంపిక అయినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. అలాగే, వివిధ పాఠశాలల విద్యార్థులకు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర, అనే అంశాలపై రాసిన వ్యాసాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

హిందూ ధర్మరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఆలయ అర్చకుల సంఘం మండల అధ్యక్షుడు అన్నాజీస్వామి



మాట్లాడుతున్న అన్నాజీస్వామి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో ధర్మ వ్యతిరేక చర్యల దృష్ట్యా హిందూ ధర్మ రక్షణకు చర్యలు తీసుకోవాలని రామచంద్రాపురం మండల ఆలయ అర్చకుల సంఘం అధ్యక్షుడు అన్నాజీ స్వామి పేర్కొన్నారు. ఆదివారం హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో హిందూ దేవాలయాల అర్చకులు, ఆలయ కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు హిందువులంతా ఏకం కావాలన్నారు. దైవ చింతనతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. అర్చకులు ఆలయ కార్యవర్గం భక్తులను నిత్యం చైతన్యవంతం చేయాలని తెలంగాణ ప్రాంత సామాజిక సద్భావన ప్రముఖ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణ పేర్కొన్నారు. యువత కమిటీలుగా ఏర్పడాలన్నారు. ఈ సమావేశంలో అర్చక సమితి ఉపాధ్యక్షుడు శేఖర్, రామచంద్రాపురం ధర్మజాగరణ ప్రముఖ పవన్ శ్రీకాంత్, కార్యకర్తలు యోగిశెట్టి హనుమంతరావు, ముకుందరెడ్డి, కృష్ణమూర్తి చారి, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం



ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గ్రామ ప్రజలు, ప్రముఖులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేశారు. సాయంత్రం గ్రామంలో మహిళలు పాల్గొని బోనాల ఊరేగింపు నిర్వహించారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్

పూజలో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

పటాన్‌చెరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని లక్డారం గ్రామంలో వేంకటేశ్వరస్వామి దేవాలయ రాజగోపుర కుంబాభిషేకం, శివపంచాయతన ఆభయాంజనేయస్వామి స్థిర ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణిలను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కల్హేర్(నారాయణఖేడ్): జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బస్వరాజ్ పాటిల్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర 4వ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కల్హేర్ మండలం మార్డికు చెందిన బస్వరాజ్ పాటిల్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన ఇప్పటికే ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. బస్వరాజ్ పాటిల్ మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నిబంధనలు తప్పనిసరి



నారాయణఖేడ్: దీపావళి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు విధిగా అనుమతులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రతీ దుకాణం వద్ద 200 లీటర్ల సామర్థ్యం గల డ్రమ్ముల్లో నీటిని నింపి ఉంచాలన్నారు. రెండు ఇసుక బస్తాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను పాటించకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం దాప్డా(కె) గ్రామానికి చెందిన సలీం కుమారుడు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ బస్వరాజ్ ఉన్నారు.

◆ విద్యార్థినికి సన్మానం



జహీరాబాద్ టౌన్: నీట్‌లో ర్యాంక్ సాధించి, ఎంబీబీఎస్ సీట్ పొందిన విద్యార్థినిని సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. పట్టణంలోని బాగారెడ్డి పల్లికి చెందిన రైల్వే ఉద్యోగి రవి కుమార్తె హనీ నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన హనీ ఎంబీబీఎస్‌లో సీట్ సాధించిన సందర్భంగా బాగారెడ్డిపల్లి చర్చిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాములునేత, సంఘ నాయకులు జయరాజ్, ఆనంద్, రాజు, తులసీదాస్ గుప్తా, విజయకుమార్ తదితరులు ఉన్నారు.

◆ విద్యుత్ షాక్‌తో గేదె మృతి



కల్హేర్(నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని దేవునిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పద్మ సంగమేశ్వర్ వ్యవసాయ భూమిలో పశువులను మేపుతుండగా తెగిపడిన కరెంట్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌తో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

◆ చిట్కుల్‌లో హనుమాన్ చాలీసా



పటాన్‌చెరు టౌన్: మండలంలోని చిట్కుల్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం భజరంగ్ దళ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, న్యాయవాది నాగరాజు యాదవ్, భజరంగ్ దళ్ జిల్లా నాయకులు మనోజ్, పటాన్ చెరు భజరంగ్ దళ్ ప్రముఖ శిరీష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.